


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గ్రేటర్ హైదరాబాద్

బుధవారం 30 ఏప్రిల్ 2025 పేజీలు 10


### జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో

## పహల్గాం ఉగ్రదాడిపై నిరసన



హైదరాబాద్ మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి):ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకునే ఏ చర్యలకైనా తమ పూర్తి మద్దతు ఉంటుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. పహల్గాం ఉగ్రదాడి పై నిరసనగా మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమీషనర్ ఆర్.వి.కర్ణన్, కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది నిరసన తెలుపుతూ ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడి భారతీయులందరీ గుండెలను కలచివేసిందని అన్నారు. ఉగ్రవాదం పై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తున్నాయన్నారు. ఉగ్రదాడి మానవతా విలువలకు, శాంతికి, సమాజ శ్రేయస్సుకు వ్యతిరేక చర్యగా ఆమె పేర్కొన్నారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ ఘటనపై ప్రజలందరూ కుల, మతాలకు అతీతంగా ఐక్యతతో స్పందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ రక్షణకు, ప్రజల భద్రతకు తీసుకునే ఏ నిర్ణయానికైనా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం వివిధ పార్టీల కార్పొరేటర్లు మాట్లాడుతూ... ఉగ్రవాదుల దాడి మిగతా 2లో




### సికింద్రాబాద్ మండల కార్యాలయాన్ని

## ఆకస్మికంగా తనిఖీ

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సికింద్రాబాద్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి,విధులకు గైర్హాజారు అయిన సిబ్బందికి తగిన షోకాజ్ నోటీసులు జారీచేశారు. మంగళవారంసికింద్రాబాద్ డివిజన్ ఆర్డీవో,తహసిల్దార్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయంలోనికి వెళ్ళి, ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, ఒక్కొక్కరిని పేరు,పేరున పిలిచి సమయానికి రాని సిబ్బందికి హాజరు రిజిస్టర్‌లో అబ్సెంట్ వేశారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించి,ఎంత మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని,ఇప్పటివరకు ఏన్ని దరఖాస్తులను ఫిజికల్ వెరిఫికేషన్, స్క్రూటీని చేసి పంపించారని తహసిల్దార్‌ను అడుగగా, అందుకు ఆయన ఇప్పటివరకు 72327 మంది నిరుద్యోగ యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని,ఇప్పటివరకు 2572 దరఖాస్తులు వ్చాయని తహసిల్దార్ తెలుపగా, అన్ని దరఖాస్తులను డౌన్‌లౌడ్ చేసుకుని,దరఖాస్తులను ఫిజికల్‌గా వెరిఫై చేసి, త్వరగా స్క్రూటీని చేయాలని జిల్లా కలెక్టర ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ ఆర్డీవో పి. సాయిరాం,తహసిల్దార్ పాండు నాయక్,డివిజన్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ శ్రీపాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### జిహెచ్ఎంసి నూతన కమిషనర్‌గా

## బాధ్యతలు స్వీకరించిన ఆర్‌వి కర్ణన్




హైదరాబాద్, మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి): జిహెచ్ఎంసి కమీషనర్‌గా ఆర్.వి. కర్ణన్ మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఐఏఎస్ అధికారుల బదిలీల లో భాగంగా ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమీషనర్‌గా నియమితులయ్యారు. బదిలీ పై వెళుతున్న కమీషనర్ కె. ఇలంబర్తి నుండి ఆర్ వి కర్ణన్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ మిగతా 2లో

### ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో

## మండిపడ్డ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కొంపల్లి మేజర్ న్యూస్ : బిఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతంతో కాంగ్రెస్ నాయకుల వెన్నులో వణుకుపుట్టిందని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ భవన్ లో రజతోత్సవ వేడుకల విజయవంతంపై కాంగ్రెస్ నాయకుల పిచ్చి ప్రేలాపనలపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల పక్షాన పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెం.1 రాష్ట్రంగా



తీర్చిదిద్దిన ఘనత గులాబీ జెండాకు, బిఆర్ఎస్ పార్టీ అధినాయకులు కెసిఆర్ కి, కేసీఆర్ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందన్నారు. రజతోత్సవ వేడుకల సభ విజయవంతంతో కెసిఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రం బాగుపడుతుందని ప్రజలు నమ్మినట్లు మరో మారు స్పష్టమైన సంకేతాలు వెళ్ళాయని, తెలంగాణ ప్రజల బాధలను, కష్టాలను తన వాణి ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తే కెసిఆర్ కి స్పష్టత లేదు అని సీఎం, మంత్రులు అనడం హాస్యాస్పదమని అన్నారు. మిగతా 2లో

# దేశంతో కంట్రీ మమేకం తీవ్రవాదానికి వ్యతిరేకం

- ఉగ్రదాడుల్ని ఖండించిన కంట్రీ క్లబ్
- శాంతి సామరస్యాల్ని కోరుతూ పీస్ వాక్
- గ్రౌండ్ జీరో నుంచి గ్లోబల్ యూనిటీ వరకూ మా నిబద్ధత ప్రపంచశాంతి కోసమేనన్న రాజీవ్ రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: దేశాన్ని, ప్రపంచాన్ని ఓ కుదుపు కుదిపిన కాశ్మీర్ ఉగ్రదాడి నేపథ్యంలో కంట్రీ క్లబ్ హాస్పిటాలిటీ అండ్ హాలిడేస్ లిమిటెడ్ (సిసిహెచ్ఎల్) గ్లోబల్ యూనిటీ ఎగైనెస్ట్ టెర్రరిజమ్ పేరిట వినూత్న రీతిలో సందేశాత్మక కార్యక్రమాన్ని నిర్వహించింది. నగరంలోని బేగంపేటలోని కంట్రీ క్లబ్ ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మోడల్స్ వెలిగే కొవ్వొత్తులు చేత పట్టుకొని, శాంతి







సామరస్యాన్ని ప్రోత్సహించే నినాదాలు ముద్రించిన ప్రత్యేక వస్త్రధారణలో మౌనంగా షార్ట్ పీస్ వాక్ చేశారు. ఈ నడక ఐక్యత, సహనం హింసలకు వ్యతిరేకంగా స్థిర సంకల్పాన్ని ప్రతిబింబించిన ఈ కొవ్వొత్తుల ప్రదర్శన, శాంతి నడకలో క్లబ్ సభ్యులు సైతం పాల్గొని శాంతి ఐక్యత సందేశం చాటారు. శాంతి అంటే యుద్ధం లేకపోవడం కాదు మానవత్వం ఉండడం హింసను తిరస్కరిద్దాం...శాంతిని ఆహ్వానిద్దాం.. నిజంగా మానవత్వం పరిఢవిల్లనిద్దాం అంటూ ఆంగ్లంలో రాసిన నినాదాలను తమ దుస్తులపై ప్రదర్శించడం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కంట్రీ క్లబ్ సిఎండి వై.రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదానికి సరిహద్దులు తెలియవు, దానిని ఎదుర్కోవాలనే మన సంకల్పం కూడా అలాగే విస్తరించాలి. అన్ని రకాల ఉగ్రవాదాన్ని ఖండించడంలో 20లక్షల మంది సభ్యులతో కూడిన మా కంట్రీ క్లబ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్ వంటి ప్రపంచ నాయకులకు సంఘీభావం తెలుపుతోంది అంటూ ప్రకటించారు.. గతంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రవాద దాడులను ఖండిస్తూ కూడా నటుడు సునీల్ దత్‌తో కలిసి నిర్వహించిన గ్రౌండ్ జీరో నిర్వహించామని, అలాంటి గత కార్యక్రమాలే తమకు ప్రేరణ అందిస్తున్నాయని అని ఆయన ఈ సందర్భంగా వివరించారు. శాంతి సామరస్యాల పట్ల తమ నిబద్ధతకు ప్రతీకగా లక్ష మంది సభ్యులు సంతకం చేసిన అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఆమోదించిన చారిత్రాత్మక ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ని కూడా ఆయన గుర్తుచే శారు. తీవ్రవాదం అనేది ప్రపంచ ముప్పుగా మారిన నేపథ్యంలో దీనిని ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సహకారం అవసరమని స్పష్టం చేశారు.

# గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణమహోత్సవం

## పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి





జవహర్ నగర్, మేజర్‌న్యూస్ః జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్‌లోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈతవనంలో కొలువైన శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో మంగళవారం అమ్మవారి కల్యాణమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకల్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి , ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరైనారు. అనంతరం ఆలయంలోని అమ్మావారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవేడుకకు విచ్చేసిన ఎమ్మెల్యేకు గౌడ సంఘం నాయకులు , బీఆర్ఎస్ నాయకులు బండి నవీన్ గౌడ్, సంఘం కమిటి సభ్యులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి కల్యాణమహోత్సవంలో మాజీ మేయర్లు మేకల కావ్యప్రవీణ్‌కుమార్, దొంతగాని శాంతి కోటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ బింగి లావణ్యసతీష్‌గౌడ్, బీఆర్ఎస్ జవహర్‌నగర్ అధ్యక్షులు భాషవోని కొండల్ ముదిరాజ్, జిల్లా సీనియర్ నాయకులు డాక్టర్ ఆలూరి రాజశేఖర్, ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బింగి సతీష్‌గౌడ్, కారింగుల వెంకటేష్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, ఆకుల ప్రభాకర్‌గౌడ్, బండి రమేష్‌గౌడ్, నందుగౌడ్, వెంకటేష్‌గౌడ్, మూల సోమయ్యగౌడ్, కృష్ణగౌడ్, రాజుగౌడ్, దామోదర్‌గౌడ్, నరహరిగౌడ్, కృష్ణగౌడ్, మహేందర్‌గౌడ్, పూజారి రాజు, మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పహల్గామ్ మృతులకు కార్పోరేటర్లు రాగుల, కళ్లెం నివాళులు

వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃగ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ దాడికి నిరసనగా నిర్వహించిన కార్యక్రమంలో వనస్థలిపురం కార్పోరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, హయత్‌నగర్ కార్పోరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డిలు పాల్గొని ఉగ్రదాడిలో మరణించిన పౌరులకు నివాళులర్పించారు. దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, దేశ బద్రత కోసం చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.



## జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో పహల్గాం ఉగ్రదాడిపై నిరసన



**మొదటి పేజి తరువాయి :** హేయమైన చర్య అన్నారు. దేశ ప్రధాని తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణచివేయడానికి ప్రధాని చేపట్టే అన్ని చర్యలకు భారతీయులుగా తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల కార్పొరేటర్లు, వంగ మధుసూదన్ రెడ్డి, రాధా ధీరజ్ రెడ్డి,లాల్ సింగ్ మీర్జాబేగ్, సోహెల్ ఖాద్రీ జగదీశ్వర్ రావు రాజశేఖర్ రెడ్డి మాట్లాగా బి జేపీ ఏ ఐ ఎం ఐ ఎం కాంగ్రెస్ కార్పొరేటర్లు సి సి పి శ్రీనివాస్, సి ఈ భాస్కర్ రెడ్డి, రత్నాకర్ అడిషనల్ కమిషనర్లు గీత రాధిక,వేణు గోపాల్ సరోజ, పంకజ, జోనల్, కమిషనర్ లు రవికిరణ్ హేమంత్ కేశవ్ పాటిల్ అపూర్వ చౌహాన్ వెంకన్న ,సి ఏ అండ్ హెచ్ ఓ డాకర్ పద్మజ తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది,జి హెచ్ ఎం సి కి చెందిన ఆయా యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో

# మండిపడ్డ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**మొదటి పేజి తరువాయి :** కెసిఆర్ ఉపన్యాసాన్ని వివిధ మాధ్యమాల ద్వారా కోటిన్నర మంది ప్రజలు వీక్షించారంటే, వారిపై ప్రజలకు ఉన్న విశ్వసనీయత, క్రేజ్, కెసిఆర్ ఇమేజ్ ఏ స్థాయిలో ఉందనేది స్పష్టమవుతుందన్నారు. కెసిఆర్ కి సరితూగే నాయకుడు తెలంగాణలోనే లేరని అన్నారు. రజతోత్సవ సభ విజయవంతంపై కాంగ్రెస్ నాయకుల మాటలు చూస్తుంటే మీరు పర్వతం ముందు పిచ్చికుక్కలు మొరిగినట్టు ఉందని, మీరు ఎన్ని మాటలు మాట్లాడిన మేరు పర్వతం విలువ తగ్గదని అన్నారు. ఆపరేషన్ కగార్ అప్రజాస్వామికం వారితో శాంతి చర్చలు జరగాలని కెసిఆర్ చెప్పిన తర్వాతనే సీఎం రేవంత్ రెడ్డి జానారెడ్డి, కేశవరావులను పిలిపించుకొని సూచనలు తీసుకుంటామనడంపై వారి అవగాహన, బాధ్యత స్పష్టమైందన్నారు. నక్సల్స్ సమస్యలు తెలిసిన మంత్రి సీతక్క నక్సల్స్ సమస్యపై మాట్లాడతారు అని అనుకున్నాం. కానీ ఎవరి మెప్పు కోసమో ఆమె కూడా సమస్య పరిష్కారానికి కృషి చేసినట్లుగా కనిపించట్లేదన్నారు. అందాల పోటీలపై ముఖ్యమంత్రికి సమీక్షించే సమయం ఉంటుంది కానీ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు, ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల బాధలు, సాగునీరు, నీటి సరఫరా పై సమీక్షించేందుకు సమయం ఉండదా అని ప్రశ్నించారు. గతంలో హైదరాబాద్ నగరంలో రెండు లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించి అందులో 1.60 - 1.70 లక్షల ఇళ్లను పంపిణీ చేశాం. వారికి కనీస వసతులు కల్పించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రజా సమస్యలపై సమీక్షలు నిర్వహించకుండా చేతులు దులుపుకుంటాము, ఇలాగే పాలను కొనసాగిస్తామంటే మాత్రం బాధ్యతాగల ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు.

## జిహెచ్ఎంసి నూతన కమిషనర్‌గా

# బాధ్యతలు స్వీకరించిన ఆర్‌వి కర్ణన్

**మొదటి పేజి తరువాయి :**

సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా సేవలందించిన ఆర్.వి. కర్ణన్, హైజీన్ ప్రమాణాలను ఉల్లంఘించిన రెస్టారెంట్లు, పబ్‌లు, ఐస్‌క్రీమ్ పార్లర్లు వంటి ఆహార సంస్థలపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా దాడులు నిర్వహించి, ప్రజలలో ఆహార భద్రత పై అవగాహన పెంచారు. జిహెచ్ఎంసి కమిషనర్ గా కొనసాగిన కె. ఇలంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్‌గా తన పదవీకాలంలో నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పౌర సేవల మెరుగుదల కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో ఎం ఏ యు డి కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా, నూతన కమిషనర్ కు అదే విధంగా బదిలీ పై వెళుతున్న ఇలంబర్తికి జిహెచ్ఎంసి అధికారులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# జేయన్టీయుహెచ్ మహిళా జేఏసీ నూతన కమిటీ ఎన్నిక



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : జేయన్టీయుహెచ్ యూనివర్సిటీలో జేయన్టీయుహెచ్ జేఏసీ జేఏసీ చైర్మన్ డా. బొట్ల బిక్షపతి అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన మహిళ కమిటీని ప్రకటించారు. అద్యక్షురాలిగా డి. రచన, ఉపాధ్యక్షులుగా వి. రచన. సంధ్యా, కార్యవర్గ అద్యక్షులుగా జాహ్నవి, సుష్మిత, కార్యదర్శులుగా శిరీష, శ్రావంతి, ప్రధాన కార్యదర్శిలుగా సాహితి ప్రియ, సుప్రియ, భార్గవి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఐశ్వర్య, శివాని, టెక్నికల్ సెక్రటరీ రిహారిక, సోషల్ సర్వీస్ సెక్రటరీ మధురిమ, కోఆర్డినేటర్లుగా స్ఫూరిత ఎంఎస్సీ, కె. శరణ్య బిటెక్, సింధు ఎంటెక్, సోషల్ మీడియా ఇంచార్జి స్నేహ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సౌజన్యలను ప్రకటించారు. జేయన్టీయుహెచ్ జేఏసీ మహీళా కమిటీ సభ్యులు విద్యార్థులకు యూనివర్సిటీ అధికారులకు అనుసంధానంగా పనిచేస్తు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా నిరంతరం కృషి చేస్తూ విద్యార్థులకు గుణాత్మకమైన విద్యకు యూనివర్సిటీ అభ్యున్నతికి పాటు పడేందుకు మహిళా కమిటీ సభ్యులు విద్యార్థులతో మమేకమై మహిళా సాధికారత సాధించి అందరికీ ఆదర్శంగా పనిచేస్తారని తెలిపారు.

# గీతం విద్యార్థికి 1.4 కోట్ల వేతనం










హైదరాబాద్, మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి): హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన సీఎస్ఈ విద్యార్థిని కారుమూరు ప్రియాంక రెడ్డి ప్రాంగణ నియామకాలలో ప్రతిష్టాత్మక అమెజాన్ కు, అత్యధిక గరిష్ఠ వార్షిక వేతనం ?1.4 కోట్లకు ఎంపికయ్యారు. గీతంలో తన ప్రయాణాన్ని ప్రియాంక గుర్తుచేసుకుంటూ,'నా కెరీర్ రూపొందించడంలో గీతం కీలక భూమిక పోషించింది. అక్కడున్న అత్యాధునిక ప్రయోగ శాలలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, విజ్ఞాన కేంద్రంగా విరాజిల్లుతున్న నాలెడ్జి రిసోర్స్ సెంటర్ (గ్రంథాలయం) వంటివి నా జ్ఞాన సముపార్జనకు ఎంతో ఉపకరించాయి. నేర్చుకున్న దానిని ఆచరణలో పెట్టే వీలు కలిగింది. దానికితోడు అక్కడున్న వాతావరణం సంక్లిష్టమైన ప్రాజెక్టులపై పనిచేయడానికి, పెద్ద డేటా సెట్ లను సమర్థంగా ప్రాసెస్ చేయడానికి వీలు కల్పించాయి' అని చెప్పారు.సమగ్ర కోడింగ్ శిక్షణ,మాక్ ఇంటర్వ్యూ సాధనాలు కోడింగ్, ఇంటర్వ్యూకు సిద్ధం కావడానికి తనకు ఎంతో సహాయపడ్డాయని ప్రియాంక తెలిపారు. 'నేను ఈ స్థాయి ఎదగడానికి సహకరించిన నా అధ్యాపకులు, మరీ ముఖ్యంగా ప్రాజెక్టు మార్గదర్శికి నా ప్రత్యేక కృతజ్ఞతలు' అని ప్రియాంక చెప్పారు. తన స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి, తాను కోరుకున్న ఉద్యోగం సాధించడానికి తోడ్పడిన గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (సీజీసీ) సేవలను ఆమె ప్రత్యేకంగా ప్రశంసించారు.

## ఇండియా ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీకండక్టర్ అసోసియేషన్‌కు కొత్త చైర్మన్‌గా రుచిర్ దీక్షిత్

IESA™ INDIA ELECTRONICS & SEMICONDUCTOR ASSOCIATION
Taking India to ESDM Leadership

ఖైరతాబాద్ మేజర్ న్యూస్ : భారతదేశంలో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ రంగాలకు ప్రాతినిధ్యం వహించే ప్రముఖ సంస్థ ఇండియా ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీకండక్టర్ అసోసియేషన్ (ఐఈఎస్ఏ) కొత్త అధ్యక్షుడిగా సిమెన్స్ ఈడీఏ ఇండియాలో వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న రుచిర్ దీక్షిత్‌ను నియమించింది. బెంగళూరులోని తాజ్ వెస్ట్ ఎండ్ హొటల్‌లో జరిగిన వార్షిక సభ్యుల సమావేశంలో ఈ నిర్ణయం వెలువడింది.ఈ సమావేశంలో 200 మందికి పైగా సభ్యులు, పరిశ్రమ ప్రముఖులు హాజరయ్యారు. 30 సంవత్సరాల అనుభవాన్ని కలిగిన రుచిర్ దీక్షిత్ ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ రంగాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తన నియామకంపై స్పందించిన ఆయన, "భారతదేశం ఈ రంగంలో ప్రపంచ శక్తి కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఈ బాధ్యత నాకు గౌరవంగా భావిస్తున్నాను. పరిశ్రమాభివృద్ధికి ఐఈఎస్ఏ ద్వారా నా వంతు కృషి చేస్తాను," అని చెప్పారు ఇంతకు ముందు ఐఈఎస్ఏ అధ్యక్షుడిగా ఉన్న అశోక్ చందక్ మాట్లాడుతూ, "రుచిర్ దీక్షిత్ అనుభవం సంస్థ అభివృద్ధికి దోహదపడుతుంది. పరిశ్రమలో కొత్త దిశను తీసుకురాగల సత్తా ఆయనకుంది," అన్నారు.కొత్తగా ఐఈఎస్ఏ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కి నియమితులైన ఇతర సభ్యులు గా అక్షయ్ అగర్వాల్ (మీడియాటెక్) డా. హేమాంగ్ షా (అప్లైడ్ మెటీరియల్స్) దీప్ కుమార్ వజ్రామ్ (7రేస్) రఘు పనికర్ (కేన్స్ సెమికాన్) సందీప్ గుప్తా (అల్ఫావేవ్వ్ ) వేక్ త్యాగి (అనలాగ్ డివైసెస్) ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వ కార్యదర్శి ఎస్. కృష్ణన్, సెమి సంస్థ అధ్యక్షుడు అజిత్ మనోచా తదితర ప్రముఖులు హాజరై పరిశ్రమ భవిష్యత్తుపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కొత్త నాయకత్వంతో భారత్‌లో సెమీకండక్టర్ రంగం మరింత అభివృద్ధి చెందనుందని పరిశ్రమ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

## సాంకేతిక విజ్ఞానంతో పాటు విద్యార్థులకు సృజనాత్మక అవసరం



ఖైరతాబాద్ మేజర్ న్యూస్ : ప్రతి విద్యార్థి సృజనాత్మకతను పెంపొందించుకోవాలని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ (డి ఆర్ డి ఓ) శాస్త్రవేత్త సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. అరోరా కాలేజీలో "అభివ్యక్తి%-%2025" పేరుతో నిర్వహించిన టెక్నో-మేనేజ్మెంట్ ఫెస్ట్‌ను హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మేరీ జెస్సికా, కాలేజీ ప్రిన్సిపాల్ ప్రదోశ చంద్ర పట్నాయక్, సుష్మలతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాలు యువత సృజనాత్మకతను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టాలంటే విద్యార్థులు ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా వేదికలకు దూరంగా ఉండాలని, పుస్తకాల పఠనంపై ఎక్కువగా మొగ్గు చూపాలని సూచించారు.ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మేనేజ్మెంట్ అంశాలపై విశదమైన అవగాహన కలిగి ఉండే వారు మాత్రమే భవిష్యత్తులో ప్రగతిపథంలో ముందుకు సాగగలరన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సునంద రాంప్రసాద్, ఎంసీఏ, ఎంబీఏ విభాగాధిపతులు విజయశ్రీ, ఆరిఫా బేగం తదితరులు పాల్గొన్నారు.ఇలాంటి విద్యా కార్యక్రమాలు యువతలో కొత్త ఆలోచనలకు దారి తీసే వేదికలుగా నిలుస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## పవర్ లిఫ్టింగ్ తెలంగాణ కాంపిటీషన్ విజయం సాధించిన వారిని అభినందించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : ఆల్విన్ కాలనీ డివిజన్ షంషీగూడ ఇంద్రహిల్స్ కు చెందిన స్నేహ విద్యా సంస్థలు స్నేహ జిమ్ చైర్మన్ యం. రాజు, డబ్ల్యూ పిసి చైర్మెన్ రేఖ ఆధ్వర్యంలో డబ్ల్యూ పిసి స్టేట్ ఓపెన్ ఛాంపియన్షిప్ పవర్ లిఫ్టింగ్ తెలంగాణ కాంపిటీషన్లో విజయం సాధించిన అభ్యర్థులకు మంగళవారం కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శాలువా కప్పి సన్మానించారు.

## కార్పొరేటర్ ధర్పల్లి సమయస్ఫూర్తితో తప్పిన పెను ప్రమాదం



కర్మన్ ఘాట్ ,మేజర్ న్యూస్ :సరూర్నగర్ నగర్ పోస్ట్ ఆఫీస్ నుంచి గ్లోబల్ హాస్పిటల్ వెళ్లే మార్గంలో మణిపురి కాలనీ వద్ద మంగళవారం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఒక్కసారిగా పేలింది. స్థానికులు కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి కి సమాచారం అందించారు.వెంటనే స్పందించి ఎలక్ట్రికల్ అధికారులకు, పోలీస్,ఫైర్ అధికారులకు అప్రమత్తం చేసి మంటలను అర్పించారు.ఎవరికీ ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు.ఎలక్ట్రికల్ ఏడి హనుమంత్ , ఏ ఈ నాదీమ్ , ఫైర్ అధికారులు శ్యామ్, నాయకులు ప్రవీణ్ రెడ్డి, నరేందర్ వున్నారు.

## కుటుంబ సమేతంగా శ్రీ వారిని దర్శించుకున్న సీనియర్ జర్నలిస్టు కట్టెల నర్సింగ్ రావు పటేల్



నల్లకుంట, మేజర్ న్యూస్‌బీ తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సీనియర్ జర్నలిస్టు కట్టెల నర్సింగ్ రావు పటేల్ కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.అంతకు ముందు శ్రీ వరాహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు.అనంతరం తిరుపతిలోని గోవిందరాజస్వామి దేవాలయం, కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయం, పద్మావతి అమ్మవారి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు

# నేడు బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా



కాప్రా, మేజర్ న్యూస్: చర్లపల్లి రైల్వే టర్మినల్ వద్ద మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పల్ మాజీ శాసనసభ్యుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ తెలిపారు.ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు జరగనున్న ఈ ధర్నాకు పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయ కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 6వ తారీఖున ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులు మీదుగా ఈ రైల్వే టర్మినల్ ను ప్రారంభించు కోవడం జరిగిందన్నారు. దీంతో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు పెరిగారు, రైళ్లు రాకపోకలు ప్రారంభ మైనా యి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం, జిహెచ్ ఎంసి ఇప్పటివరకు కనీసం వీధి లైట్లు కూడా ఏర్పాటు చేయలేదని, బస్సుల సంఖ్య పెంచలేదని , పలు డిపోల నుంచి బస్సులు నడపడం లేదని, స్టేషన్‌కు దారి అని సూచిస్తూ బోర్డులను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. స్టేషన్ కు దారి నిర్మాణం పూర్తి చేయలే దన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ధర్నాను విజయ యవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఉగ్రవాదం, ఆపరేషన్ కగార్ అనే రెండు దేశానికి ప్రమాదం

- ప్రజాసంఘాల నేతలు
- శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలి
- ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసి ప్రజలను హతమార్చడం అప్రజాస్వామికం






జవహర్ నగర్, మేజర్న్యూస్: ఉగ్రవాదం, ఆపరేషన్ కగార్ అనే రెండు దేశ ప్రజలకు ఎంతో ప్రమాదకరమైనవని, జీవించే హక్కును కాలరాస్తున్నారని వక్తలు మండిపడ్డారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్లోని దళిత భవన్లో సోమవారం సాయంత్రం ఉగ్రదాడి, ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న దాడులపై ప్రజాసంఘాల నేతలు, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమం పిఓడబ్ల్యూ(విముక్తి) నాయకురాలు పెర్క సునీత అధ్యక్షతన సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు జరిగింది. ఈసందర్భంగా వక్తలు మాట్లాడారు ...అమాయకులను పొట్టనపెట్టుకుం టన్న ఆపరేషన్ కగార్, ఉగ్రదాడుల దాడులను ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి పాషామియా, కాలేషాలు ఖండించారు. కార్పోరేట్ సంస్థల దోపిడి కోసమే ఆపరేషన్ కగార్ను కేంద్రం తీసువచ్చి అమాయకుల గిరిజనులను చంపుతుందని సీపీఐ (ఎంఎల్) నాయకులు వి ప్రవీణ్కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తుం దని అధ్యక్షులు మల్లేపూల శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివాసి ప్రజలను ఆపరేషన్ కగార్ పేరుతో హతమార్చడం అప్రజాస్వామికమని, వెంటనే శాంతి చర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసి నాయకులు యాదన్న, ఐఎఫ్టియు నాయకులు శివబాబు, సీపీఐ నాయకులు దర్శనం యాదగిరి, కవి, రచయిత ఎస్కే మీరాలు డిమాండ్ చేశారు. అటవి హక్కుల సంరక్షణకు పాటుపడుతున్న మావోయిస్టులను ఇప్పటి వరకు సుమారు ఐదు వందల మందిని భూటకపు ఎన్కౌంటర్ల పేరుతో హతమార్చారని, ఆదివాసి ప్రజలపై జరుపుతున్న ఈఆపరేషన్ కగార్ యుద్దాన్ని నిలిపివేసేలా శాంతి చర్చలకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేలా డిమాండ్ చేయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, పౌర సమాజం పిడికిలి బింగించాల్సిన సమయం ఆసన్నమైందని పిడిఎం రాష్ట్ర నాయకులు చంద్రమౌళి, ఇప్టూ జాతీయ నాయకులు షేక్ షావలి పిలుపునిచ్చారు. ఉగ్రవాదులు అమాయక ప్రజలను చంపడాన్ని పీకేఎం నాయకులు జాన్ తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పటి వరకు జరిగిన ఆదివాసి మావోయిస్టు హత్యలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు జేసుదాస్ చక్రవర్తి, బహుజన సత్తా నాయకులు బండికింది సింగరయ్యగౌడ్, బహుజన రక్షణ సమితి నాయకులు జావేద్, విజయ్ శంకర్, చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు అల్లూరి సావిత్రి, వికలాంగుల సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, సైయద్, వహీద్, బడిగే వెంకటేష్, తదితరులు పాల్గోన్నారు.

## సమ్మర్ క్యాంపును దిగ్విజయంగా నిర్వహించేందుకు గ్రౌండ్ ఇన్ఛార్జీలతో

# ప్రత్యేక సమావేశం నిర్వహించిన బల్దియా అదనపు కమిషనర్ యాదగిరిరావు

సిటీబ్యూరో,మేజర్న్యూస్: స్థానిక ఏమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా బల్దియా తరపున ప్రతి ఏటా నిర్వహించే సమ్మర్ క్యాంపు నిర్వహణ కాస్త ఆలస్యంగా ప్రారంభం అయిన నేపథ్యంలో,సమ్మర్ క్యాంపును ఎంతో సమర్ధవంతంగా,బా , ధ్యతయుతంగా నిర్వహించేందుకు ఖైరతాబాద్ జోనల్ గ్రౌండ్ల ఇన్ఛార్జీలు పూర్తి శ్రద్ధను కనబర్చాలని, ఫీజు వసూలు విషయంలో బల్దియా స్పోర్ట్స్ వెబ్సైట్ను చూడాలని ఆటగాళ్ళకు వివరించవల్సిన బాధ్యత గ్రౌండ్ల ఇన్ఛార్జీలదేనని బల్దియా అదనపు కమీషనర్ (స్పోర్ట్స్) యాదగిరిరావు హితోపదేశం చేశారు. మంగళవారం చాదర్ఘాట్లోని విక్టోరియా ప్లే గ్రౌండ్లో ఖైరతాబాద్ జోనల్ స్పోర్ట్స్ అదనపు డైరెక్టర్ రహీనా బేగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రౌండ్ల ఇన్ఛార్జీల ప్రత్యేక అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులు నిర్వహించే గ్రౌండ్లను నిత్యం పరిశుభ్రంగా,క్రీడాకారులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. విధుల నిర్వహణలోకూడా ఏమాత్రం అశ్రద్ధ వహించవద్దని,ఈసారి సమ్మర్ క్యాంపులో అత్యధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొనే విధంగాగ్రౌండ్ల ఇన్ఛార్జీలు తగిన చొరవ తీసుకో వాలన్నారు. సమ్మర్ క్యాంపు ఆటల సమయ వేళలను ఎంతో పకడ్బందిగా సమయ పాలన ను పూర్తిగా పాటించాలన్నారు. ఖైరతాబాద్ జోనల్ స్పోర్ట్స్ అదనపు డైరెక్టర్ రహీనా బేగం ప్రసంగిస్తూ, ఖైరతాబాద్ జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి నేతృత్వంలో ఈసారి సమ్మర్ క్యాంపులను ఎంతో దిగ్విజయంగా నిర్వహించేందుకు ఖైరతాబాద్ జోనల్ పరిధిలోని అన్ని గ్రౌండ్లలో చిన్నారులు సమ్మర్ క్యాంపుకు ఎంతో ఉత్సాహంతో పాల్గొని, ఆటల్లో తమ ప్రతిభను కనబరుస్తున్నారని ఆమె చెప్పారు. బల్దియా ఆధ్వర్యంలో గ్రౌండ్లలో ఆటలకు నామ మాత్రపు ఫీజులే ఉంటాయని, మరిన్ని వివరాలకోసం జిహెచ్ఎంసి స్పోర్ట్స్ వెబ్సైడ్ను చూడాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో గేమ్స్ ఇన్స్పెక్టర్ మాధవితోపాటు పలువురు గ్రౌండ్ల ఇన్ఛార్జీలు తదితరులు పాల్గొన్నారు.



# 4న 'స్పర్శలేని శిల' కవితాసంపుటి ఆవిష్కరణ : కవయిత్రి ఎన్.లహరి



రవీంద్రభారతి,మేజర్న్యూస్ :తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ,ఉదయసాహితీ ఆధ్వర్యంలో యువకవయిత్రి ఎన్.లహరి రచించిన 'స్పర్శలేని శిల' కవితాసంపుటి ఆవిష్కరణ సభ మే4న సా. 6గం.లకు రవీంద్రభారతిలో నిర్వహించనున్నారు. ఈమేరకు కవయిత్రి లహరి ఓ పత్రికాప్రకటనలో తెలిపారు.స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, కవి డా.ఏనుగు నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. దాస్యం సేనాధిపతి, డా.మామిడి హరిక్రిష్ణ, మువ్వా శ్రీనివాసరావు,యాకూబ్,శైలజమిత్ర(పుస్తకపరిచయం),మౌనశ్రీమల్లిక్, పి.శ్రీనివాస్గౌడ్,డి.మోహన్,ఎన్.అవనీష్, లక్ష్మీపద్మజ దుగ్గరాజు అతిథులుగా పాల్గొంటున్నారని కవయిత్రి లహరి ఓ పత్రికాప్రకటనలో తెలిపారు.

# కళాసేవలో 'శాంతికృష్ణ'!



రవీంద్రభారతి,మేజర్న్యూస్ :శ్రీశాం తికృష్ణసేవాసమితి (1985) వ్యవస్థాపకులు డాక్టర్.వంగాల శాంతికృష్ణ వరంగల్ జిల్లా.బతుకమ్మ తల్లి జన్మస్థలం చౌటపల్లి గ్రామం.డా. శాంతి కృష్ణ జానపద నృత్యం పట్ల మక్కువ.రంగస్థల కళాకారు డు.జానపద నృత్యకళా దర్శకుడు. ,దార్మిక,ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయడంలో వివేకం ఆయన సొంతం. విశ్వకళావిరాట్ బిరుదుతో పాపులర్ అయ్యారు.బతుకమ్మ తల్లి మహాబృంద నృత్యం (2019)ఫేమ్.ఈ నృత్యం ప్రపంచరికార్డును సొంతం చేసుకోవడం విశేషం!అమెరికా,కెనడా,బ్రిటన్, ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా,జర్మనీ, ఫ్రాన్స్,సింగపూర్..ఇలా మొత్తం 54దేశాల్లో తనకళాబృందాలచే నృత్యప్రదర్శన ఇచ్చారు శాంతికృష్ణ.సామాజిక సేవా రంగాల్లోనూ వీరి సేవలు గొప్పగా ఉండటం విశేషం.

## మే2న 'ముసాఫిర్' కవిత్వం ఆవిష్కరణ : జెల్ది

రవీంద్రభారతి,మేజర్న్యూస్ : విమల సాహితీ సమితి -అధ్యక్షులుడా.జెల్ది విద్యాధర్ రచించిన ' ముసాఫిర్-కవిత్వం పుస్తకావిష్కరణ సభ మే2న రవీంద్రభారతిలో ఉదయం 9గం.లకు నిర్వహిస్తున్నారు. ఈమేరకు సమితి అధ్యక్షులు జెల్ది ఓ పత్రికాప్రకటనలో తెలిపారు.పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. డా.బిక్కికృష్ణ, డా.పి.విజయలక్ష్మిపండిట్, డా.నాళేశ్వరం శంకరం,శైలజామిత్ర, రోహి ణి వంజారి, డా.రాధాకుసుమ, మంజుల సూర్య, కళ్యాణి తురుమెళ్ళ అతిథులుగా పాల్గొంటారని జెల్ది తెలిపారు.

# భారతదేశానికి వ్యతిరేకంగా మాట్లాడేవారికి దేశ పౌరసత్వాన్ని రద్దుచేయాలి

## ప్రముఖ సంఘ సేవకురాలు సి.ఆర్.స్వరూపారాణి



సిటీ బ్యూరో, మేజర్ న్యూస్: పాక్,బంగ్లాదేశ్లకు మద్ధతుగా మాట్లాడుతూ,భారతదేశాన్ని కించపరిచేవిధంగా వ్యాఖ్యలు చేసేవారు,ఏంతటి వారైనా,వారికి దేశ పౌరసత్వాన్ని రద్దుచేసి,ఏ దేశం పాటను పాడుతున్నారో,ఆ దేశ సరిహద్దు ప్రాంతాల్లో వారిని వదిలిపెట్టాలని,దేశ ం లోనే ఉంటూ దేశ వ్యతిరేకతకు పాల్పడేవారిమీద దేశ ద్రోహం కేసులను నమోదు చేయాలని, ఈనెల 22వ తేదిన పహల్గామ్లో అమాయక టూరిస్టులమీద పాక్ ఉగ్రవాదులు విచక్షణ రహితంగా కాల్పులకు పాల్పడిన ఉగ్రవాదులను నడిరోడ్డుమీదే,వారిపై విచక్షణరహితంగా కాల్పులు జరిగి చంపివేయాలని ప్రముఖ సంఘ సేవకురాలు,మహిళా మండలి నాయకురాలు సి.ఆర్. స్వరూపారాణి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం విజయనగర్కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వరూపరాణి మాట్లాడుతూ పాకిస్తాన్,బంగ్లాగేశ్ల పాలకులు ,భారతదేశం ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఈ రెండు దేశాలు ఉగ్రవాదులతో భారతదేశ సరిహద్దును దాటించి, దేశ సరిహద్దులో విధ్వంసక చర్యలకు పాల్పడుతుందని,వారి చర్యలను దేశ త్రివిధ బలగాలు తిప్పికొడుతూ ఉగ్రవాదుల భరతం పట్టి తగిన గుణపాఠం నేర్పడం ఎంతో అభినందనీయమన్నారు. దేశ రక్షణకోసం నిరంతరం ఎంతో అక్రమత్తంగా ఉంటూ,ఉగ్రవాదుల,దేశద్రోహల ఆటలను అడ్డుకట్ట వేయడంలో త్రివిధ బలగాలు పోషిస్తున్న పాత్ర ఎంతో ప్రశంసనీయమన్నారు. వారివల్లనే, దేశ ప్రజలందరు ఎంతో సుఖంగా జీవిస్తున్నారని,వారి సేవలు ఆమోఘం,ఎంతో అద్భుతమని,దేశానికి నిజమైన దేశ భక్తులు త్రివిధ బలగాలేనని ఆమె చెప్పారు. దేశంలోనే ఉంటూ,దేశద్రోహనికి పాల్పడుతున్న వారు ప్రజా ప్రతినిధులైనా,మంత్రులైన,ఉన్నతాధికారులైన,ప్రముఖ వ్యాపారులైన వారిని ఏమాత్రం వదిలిపెట్టకుండా,వారందరిని అండమాన్ దీవుల్లో పడేయాలన్నారు. పహల్గామ్లో ఉగ్రవాదుల కాల్పుల దాడిలో ఆసువులు బాసిన అమాయక టూరిస్టుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు ఆమె చెప్పారు.

# విద్యార్థిని ఇఫ్ఫాతున్నిసాను అభినందించిన ఎమ్మెల్యే

## -ఇంటర్‌లో స్టేట్ 5వ ర్యాంక్ సాధించిన ఇఫ్ఫాతున్నిసా



కొంపల్లి, మేజర్‌న్యూస్ః ఇంటర్మీడియట్‌లో 1000 మార్కులకు గాను 991 మార్కులు సాధించి రాష్ట్రంలోనే ఐదవ ర్యాంకు సాధించిన పేద విద్యార్థిని ఇఫ్ఫాతున్నిసాను మంగళవారం బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అభినందించారు. నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధిస్తూ "మేం బాలుర కంటే ఏ మాత్రం తక్కువ కాదు" అంటూ కష్టించి చదివి ఉత్తమ ఫలితాలు సాధించారు సంధ్య, ఇఫ్ఫాతున్నిసా. ఇలాంటి విద్యార్థినులను ప్రోత్సహిస్తూ ఎందరో ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలకు ఆదర్శంగా నిలుస్తున్నారు మన ప్రజా సంక్షేమ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ విప్, విద్యావంతులు, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్. తాజాగా వెలువడిన ఇంటర్ ఫలితాల్లో జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్‌లో నివాసముండే ఎండీ అబ్దుల్ గఫ్ఫూర్, సఫియా సుల్తానాల కుమార్తె ఇఫ్ఫాతున్నిసాకు చదువుపై ఉన్న ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు స్తోమత లేక స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నాల్గవ తరగతి వరకు చదివించారు. తండ్రి వృత్తి రీత్యా పాన్ షాప్ నిర్వహిస్తుండగా, తల్లి ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా గురుకుల పాఠశాలలో ఉద్యోగం చేస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత విద్యావ్యవస్థలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సమూల మార్పులతో 2017లో నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్షలో ఇఫ్ఫాతున్నిసా మౌలాలిలోని సనత్‌నగర్ గర్ల్ - 1, గురుకుల పాఠశాలలో సీటు సాధించి ఐదవ తరగతిలో చేరింది. 2017లో గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందిన ఇఫ్ఫాతున్నిసా అప్పటి నుంచి వెనక్కు తిరిగి చూసుకోకుండా చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ 2023 టెన్త్ పరీక్షలో 10/10 పాయింట్లు సాధించింది. అనంతరం అదే పాఠశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగం తీసుకొని 2024 సంవత్సరంలో జరిగిన వార్షిక పరీక్షలో 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్ సాధించింది. ఈ 2025 సంవత్సరంలో జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో 1000 మార్కులకు గాను 991 మార్కులు సాధించి రాష్ట్రంలోనే ఐదవ ర్యాంకును సాధించింది. రాష్ట్ర స్థాయిలో ఐదవ ర్యాంక్ సాధించిన విద్యార్థిని "ఇఫ్ఫాతున్నిసా"ను సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ మైనార్టీ అధ్యక్షులు అజం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలువగా విద్యార్థిని "ఇఫ్ఫాతున్నిసా"కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించి, ఆశీస్సులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నత విద్యను పూర్తిచేసి పుట్టిన ఊరికి, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కలలు కనే నిరుపేద విద్యార్థుల ఆశలకు "కాంతి రేఖ" అయి పెద్దలు కేసీఆర్ గురుకుల పాఠశాలల సంఖ్యను పెంచి, ఆయా పాఠశాలలో పౌష్టిక ఆహారం, మంచి విద్యకై ఎన్నో సంస్కరణలు చేపట్టారన్నారు. భవిష్యత్‌లో విద్యార్థిని "ఇఫ్ఫాతున్నిసా" ఉన్నత చదువుల్లో, లక్ష్య సాధనలో తన పూర్తి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# సన్న బియ్యం పథకం పేదలకు గొప్ప వరం : పరమేశ్వర్ రెడ్డి

కాప్రా, మేజర్ న్యూస్: చరిత్రలో నిలిచిపోయే సన్న బియ్యం పథకం పేదలకు గొప్ప వరం కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్త అంజిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జమ్మిగడ్డలోని రెండు రూపాయలకు కిలో బియ్యం లబ్ధిదారులు ఏరోళ్ల పద్మ ఇంట్లో సామూహిక భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సామాన్యుడికి మూడు పూటల సన్న బియ్యం భోజనం పెట్టడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పేదలకు వరంగా మారిందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి పేదల పక్షపాతిగా సన్న బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు.ప్రభుత్వం కొలువు దీరిన అతి తక్కువ కాలంలోనే అద్భుత రీతిలో ప్రజాభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజాధారణ పొందుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషి పట్ల లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి సంతోషాన్ని పరమేశ్వర్ రెడ్డి పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్, కె. సీతారాంరెడ్డి, అల్లూరయ్య, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసా య మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, అజీజ్, లింగం, భూపాల్ రెడ్డి, శ్రీను, నర్సింహా, అనిల్, గుణ శేఖర్, రామ్ లింగం, నాగరాజు,కిరణ్, ప్రకాష్, ఉష రాణి, మమ్మడి శ్రీను, రామలింగం, శ్రీకాంత్, ఏఎస్ రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ రాందేవ్ ఆసుపత్రి డాక్టర్స్, సిబ్బంది నిరసన ర్యాలీ






కూకట్ పల్లి మేజర్ న్యూస్ : ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో కదిలించాలని ఆసుపత్రి ఎండి కల్నల్ కమలాకర్ అన్నారు. ఉగ్రవాదాన్ని దేశం నుండి పాలద్రోలాలని, మానవత్వాన్ని పెంపొందించాలని ప్రముఖ రేఖి థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్ తెలిపారు.జమ్మూ కాశ్మీర్ లోని పహాల్గం లో జరిగిన మరణకాండకు నిరసనగా మరణించిన కుటుంబాలకు సంఘీభావంగా రాందేవ్ రావు ఆసుపత్రి కుముదిని దేవి కాలేజ్ అండ్ స్కూల్ అఫ్ నర్సింగ్ సిబ్బంది తమ నిరసన ను శాంతి ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమాన్ని లక్ష్మి కమలాకర్ జాతీయ జెండాను ను ఊపి ర్యాలీని ప్రారంభించారు. 75 అడుగుల జాతీయ పథకాన్ని రాందేవ్ రావు ఆసుపత్రి సిబ్బంది, కుముదిని దేవి స్కూల్ అండ్ కాలేజ్ అఫ్ నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది కలిసి శాంతి ర్యాలీ ని నిర్వహించారు.ఈ ర్యాలీ లో ఉగ్రవాదుల దాడి కి మృతి చెందిన వారి ఫోటో ల ముందు కాండిల్స్ వెలిగించి మౌనం పాటించారు.

ఈ సందర్భంగా లక్ష్మి కమలాకర్ మాట్లాడుతూ మానవత్వ విలువలను దేశ భక్తి ని అందరు పెంపొందించుకోవాలని అన్నారు. ఇలాంటి సంఘటనలను ఎవ్వరు పాల్పడకూడదని ఉగ్రవాదులకు చేతులెత్తి వేడుకుంటున్నాని అన్నారు. ఆసుపత్రి ఎండి కల్నల్ డా. కామలాకర్ మాట్లాడుతూ దేశ సైనికులకు దాని రక్షణ వ్యవస్థకు మరిన్ని విశేష అధికారాలు ఇవ్వాలని అన్నారు. ఉగ్రవాదం అనేది దేశానికీ హాని చేస్తుందని, శాంతి భద్రతలను భంగం కలిగిస్తుందని డా ఛాయా దేవి అన్నారు. దేశంలో భారతీయులందరు ఒకటే అని, మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే అని శిరీష అంబల్ల అన్నారు.ఏ మతం ఐనా హింసను ప్రోత్సాహించారుదని ఆస్పత్రి సీఈవో డాక్టర్ యోబు అన్నారు.ఈ ర్యాలీ లో డాక్టర్లు, అడ్మిన్ స్టాఫ్, నర్సులు, హాస్పిటల్ సిబ్బంది నర్సింగ్ కాలేజీ విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.




# అమర కళాకారుల త్యాగాలు వెలకట్టలేము



హిమాయత్ నగర్ ,మేజర్ న్యూస్ : ఉద్యమ అమర కళాకారుల త్యాగం వెలకట్టలేము అని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి అన్నారు.బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ప్రజా ఉద్యమ కళాకారుల సంస్మరణ సభ ను సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వేముల యాదగిరి, డోలక్ యాదగిరి అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, గద్దర్ కుమారులు సూర్యం, దరువు అంజన్న, టీయూజేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రెటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి బతుల సోమన్న, టీజే ఎఫ్ మోహన్ బైరాగి, కే సి ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలలో కళాకారుల పాత్ర మరువలేమనీ తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి తొలి దశ, మలి దశ ఉద్యమాలలో కళాకారుల పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణంతో ప్రజలు నిర్వాసితులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజల కోసం పని చేయాలన్నారు. కళాకారులు అణగారిణ వర్గాలకు మద్దతుగా పాటలు పాడాలని, నోరు లేనోళ్ళకు కళాకారులు గొంతుకగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో షేక్ షావలి, మార్వాడి సుదర్శన్, కోలా జనార్ధన్,గంగి రాజు, బోగే పద్మా, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి



కర్మన్ ఘాట్, మేజర్ న్యూస్: చంపాపేట్ డివిజన్ పరిధిలోనీ మండల పరిషత్ కేంద్ర ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి అన్నారు. చంపాపేట్ డివిజన్ పరిధిలో జిహెచ్ఎంసి అధికారులతో కలిసి మండల పరిషత్ కేంద్ర ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో రూ.10లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ఫ్లోరింగ్, గ్రీనరీ, పెయింటింగ్, పనులు మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని లక్ష్యంతో ఫ్లోరింగ్, గ్రీనరీ, పెయింటింగ్, సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. చంపాపేట్ డివిజన్ పరిధిలో అనేక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశానని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులకు విద్యా బోధన జరిగేలా అవసరమైన మౌలిక సదుపాయాలను రూపొందించడం జరుగుతుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు అనంత రెడ్డి, మున్సిపల్ ఏ.ఈ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వేడుక...




ముషీరాబాద్ మేజర్ న్యూస్ :జగద్గురు ఆది శంకరాచార్య జయంతి ఉత్సవములలో రెండవ రోజు, ఉదయం వేద పండితులు శస్త్రోక్తముగా లక్ష్మి గణపతి హోమం, మన్యుసుక్త హోమము , రుద్ర హోమము, నక్షత్ర హోమము జరిపించారు బ్రహ్మశ్రీ నోరి నారాయణ మూర్తి హనుమత్ విశ్వరూపం ప్రవచనం అత్యంత ఉద్వేగంగా సాగింది. సాయంత్రం. శంకరాచార్య భక్త సమాజం మహిళలచే సామూహిక లలితా సహస్ర పారాయణం, అనంతరం ప్రఖ్యాత విదుషీమణి, ఆధ్యాత్మిక ప్రవచన వేత్త డాక్టర్ అనంత లక్ష్మి గారి శంకర మనో విలాసం అనే అంశం పై ప్రవచించారు ఈ కార్యక్రమం లో ఆది శంకర భక్త సమాజం అధ్యక్షులు తేలుకుంట్ల రమేష్ గుప్త, సమాజం సభ్యులు, జగన్నాధం ఇంకా ఇతర సభ్యులు పాల్గొన్నారు

# స్టేట్ రిసోర్స్ పర్సన్ (ఎస్.ఆర్.పి)గా డాక్టర్. ఎస్. విజయ భాస్కర్



చార్మినార్, మేజర్ న్యూస్: హైదరాబాద్ పాతబస్తీ గౌలిపురా నుంచి లలిత బాగ్ రోడ్డు లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల శాలిబండ స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) డాక్టర్.ఎస్. విజయ భాస్కర్ స్టేట్ రిసోర్స్ పర్సన్ ( ఎస్.ఆర్.పి)గా ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం లోని 33 జిల్లాలలో ఉన్న భాష పండితులకు, స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి వినూత్న పద్ధతిలో బోధించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో దరఖాస్తులను ఆహ్వానించి ఇంటర్వ్యూలను నిర్వహించి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ ఇవ్వడానికి పది మంది తెలుగు లో రిసోర్స్ పర్సన్ లను ఎంపిక చేసింది దానిలో పాతబస్తీ లో పుట్టి పెరిగిన డాక్టర్.ఎస్.విజయ భాస్కర్ ఉండడం అభినందనీయం. డాక్టర్.ఎస్. విజయ భాస్కర్ పోతుకూచి సాంబశివరావు జీవితం -రచనలు, దళిత వాద వివాదాలు, పర్యావరణం,సునామీ! ఓ సునామీ! పోతుకూచి సాంబశివరావు నాటకాలు – ఒక పరిశీలన,జీవన యానం, జీవన రాగం, అక్షర భాస్కరం అనే పది పుస్తకాలు రచించారు.అనేక దిన,వార,మాస, త్రైమాసిక, వార్షిక పత్రికలలో అనేక కవితలు, వ్యాసాలు అనేకం రాస్తున్నారు.అనేక ప్రముఖ దిన పత్రికలలో సమకాలీన అంశాలపై, తెలుగు సాహిత్యంపై పరిశోధన వ్యాసాలు రాస్తున్నారు. డాక్టర్.ఎస్.విజయ భాస్కర్ తెలంగాణ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గా ఎంపిక కావడంతో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల శాలిబండ ప్రధానోపాధ్యాయులు హరి నారాయణ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల అఫ్జల్ గంజ్ (ప ,దా నో పా ,ద్యా య య ు ు రా ల ు పి.ఎల్.పద్మజాకుమారి,షాహినాత్ గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీతారామ శాస్త్రి, చాంద్రాయణగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ సింగ్ బండ్లగూడ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్ దశరథ్ ఇంకా అనేక మంది స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), భాష పండితులు (తెలుగు), వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లోని ముఖ్యంగా హైదరాబాద్ జిల్లా లో తెలుగు భాషాభివృద్ధికి డాక్టర్.ఎస్.విజయ భాస్కర్ సేవలు ఎంతో ఉపయోగపడతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## రామానుజనగర్ కాలనీలో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నూతన దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవము

వనస్థలిపురం,మేజర్న్యూస్ఃవచ్చే నెల 2వ తేదీ నుండి 8వ తేదీ వరకు రామానుజ నగర్ కాలనీలో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నూతన దేవాలయ ప్రతిష్టా మహోత్సవం కార్యక్రమం జరుగనుంది. శ్రీ భూ గోదా సమేత శ్రీ గోవింద్ పెరుమాళ్ల దివ్యానుగ్రహంతో, శ్రీ మదుభయ వేదాస్త ప్రవర్తకాచార్యులు పరమ హంస పరివ్రాజకులు శ్రీ భాష్య కార సిద్దాంత పీఠాధిపతులు అనంత శ్రీ విభూషిత శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి వారు హయత్‌నగర్ మండలం, మునగనూరు గ్రామం రామానుజనగర్ కాలనీలో శ్రీ గోవింద క్షేత్రము నామ కరణముతో శ్రీ పద్మావతీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారినూతన దేవాలయ ప్రతిష్ట మహోత్సవం నిర్వహింప తలపెట్లారని నిర్వాహకులు తెలిపారు. ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మే 2వ తేదీన సాయంత్రం శ్రీ భూ గోద



సమేత గోవింద పెరుమాళ్లు, శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో అంతరంగ వైభవంగా దేవాలయ నూతన మూర్తులతో రామానుజ కాలనీలో అశేష భక్త జనులతో దేవాలయ వరకు శోభా యాత్ర జరుగుతుంది. 3వ తేదీ సాయంత్రం శ్రీ విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనము, రుత్విగ్వరణ ము, అంకురార్పణ యాగశాల ప్రవేశం, తీర్ధప్రసాద వితరణ, 4వ తేదీన చతుస్థానార్చనలు, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, 5వ తేదీ నూతన మూర్తులకు కర్మాంగస్నపనము, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారి అనుగ్రహ భాషణమ్, 6వ తేదీ శ్రీ త్రిదండి శ్రీ అహోబిలం రామానుజ జీయర్ స్వామి వారి అనుగ్రహం భాషణ మ్, 7వతేదీ ఆలయ గోపుర మంటపాదులకు ఛాయాస్నపనమ్, శ్రీ త్రిదండి చిన్న శ్రీ మన్నారా యణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళా శాసన పూర్వ అనుగ్రహ భాషణమ్, 8వ తేదీన ఆలయ శిఖర ప్రతిష్ట, మూర్తి ప్రతిష్టాప నుములు, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు, సాయంత్రం శాంతి కళ్యాణ మహోత్సవం అనంతరం తీర్ధ ప్రసాద వితరణ, ఉత్సవ పరిసమాప్తి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# అష్టలక్ష్మి దేవాలయంలో ఆహుతులను అలరించిన పాండవోద్యోగం

## పౌరాణిక పద్య నాటకం – ఆకట్టుకున్న క్లాసికల్ డాన్స్



వనస్థలిపురం,మేజర్న్యూస్అష్టలక్ష్మి దేవాలయం 29 వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి శ్రీ శ్రీ భార్గవ్ కళా నాట్య మండలి వారి సమర్పణలో పాండవోద్యోగం సుప్రసిద్ధ పౌరాణిక పద్య నాటకం ప్రదర్శన జరిగింది. తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ వారి సౌజన్యంతో జరిగిన ఈ నాటక ప్రదర్శన ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ నాటక ప్రదర్శనలో శ్రీ కృష్ణుడుగా మల్లాది వెంకటరమణ, దుర్యోధనుడుగా మంతోజు సాల్వాచారి, అర్జునుడుగా బి. నారాయణ స్వామి, భటుడుగా మరదాపు రామమోహన్‌రావులు నటించి ప్రేక్షకులను మెప్పించారు. నాటక ప్రదర్శనకు హార్మోనియం మంగపతిరావు, మేకప్ బావనపల్లి పరమేష్ అందించగా, బి.టి ప్రసాద్, యం. రామ్మోహన్‌రావు, యంఎస్ఎస్ హరీష్ లు సహకారం అందించారు. నాటక ప్రదర్శన, డాన్స్ కార్యక్రమం అనంతరం కళార్పణ అకాడమీ నారాయణపేట జిల్లా వారిచే అష్టలక్ష్మి స్తోత్రం, శ్రీ మన్నారాయణ, బాగ్యలక్ష్మి భారమ్మలు కూచిపూడి డాన్స్ చేసి ఆహుతుల మన్ననలు పొందారు. కార్యక్రమం అనంతరం గౌరిశెట్టి చంద్రశేఖర్, లావణ్య, స్వరూపరాణి, పరణ లావణ్య, లక్ష్మి సుబ్రమణ్యం, గ్రంధి రమేష్ కమిటి వారు కళాకారులను ఘనంగా సత్కరించారు. ఒక నాడు ఎంతో ప్రాచుర్యం పొందిన పౌరాణిక పద్య నాటకాలకు నేటికి వన్నె తగ్గ లేదని, తమ నటన ద్వారా నాటక రంగాన్ని ప్రేక్షకులు ఆదరించే విధంగా కాపాడుతున్న కళాకారులను తెలంగాణ ప్రభుత్వం ఆదరించడం సంతోషదాయకంగా ఉందని, నాటకాలు, కళాకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వానికి ఈ సందర్భంగా కళాకారులు కృతజ్ఞతలు తెలియజేశారు.





# ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

- దేశ భద్రతను పటిష్ఠం చేయాలి
- ప్రశాంత్‌నగర్‌లో కాలనీ వాసుల కొవ్వొత్తుల ర్యాలీ
- పాల్గొన్న పి.ఓ.డబ్ల్యు అధ్యక్షురాలు అనసూయ



వనస్థలిపురం,మేజర్న్యూస్ఃవనస్థలిపురం ప్రశాంత్‌నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రాత్రి పెహల్గామ్ ఉగ్రవాదుల దాడిలో మరణించిన అమాయక పౌరులకు కొవ్వొత్తులతో ర్యాలీ ద్వారా నివాలులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదులను కఠిణంగా శిక్షించాలని, మతోన్మాదాన్ని కట్టడి చేయాలని, దేశ బద్రతను పటిష్ఠం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బాలాజీనాద్, కార్యదర్శి కరుణాకర్, కట్ట భగవంతరెడ్డి, యుగంధర్‌రెడ్డి, బిజిఎం రెడ్డి, గోవర్దన్, కృష్ణారెడ్డి, డాక్టర్ కేశవరావు, ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, సుకృత, నిర్మలచౌదరి, శోభ, వాణి, లక్ష్మి, విజయలక్ష్మి, యువిఎస్ బాబు, శ్రీకాంత్, శ్రీధర్, అరుణ, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐకాన్ అవార్డ్స్ ప్రదానం




బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ రజతోత్సవ వేడుకసాను నిర్వహించారు.త్యాగరాయగానసభలో అకాడమీ డైరెక్టర్ విక్కీ మాస్టర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. రిటైర్డ్ జడ్జి బూర్గుల మధుసూధన్ చౌహాన్ రవీంద్ర సింగ్ వీరభోగ వసంతరాయలు అతిధులుగా హాజరయ్యారు. దేవరకొండ శ్రీనివాసరావు సుధారమ్య అనురాధ నాట్య గురువులను సత్కరించారు. బాలలు ప్రదర్శించిన నాట్యం ప్రతిభావంతంగా సాగింది.జీ.భాగ్య లక్ష్మి గోపికార్ వునీత్ జీ. శ్రీవల్లి పాల్గొన్నారు.: **ముషీరాబాద్ మేజర్ న్యూస్**

# మస్తాన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక



అల్లాపూర్, మేజర్న్యూస్ : కూకట్‌పల్లి నియోజకవర్గం, అల్లాపూర్ డివిజన్‌లో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరికలు జరిగాయి. సీనియర్ నాయకుడు దేవరింటి మస్తాన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కడపర్తి ఉపేందర్, రమేష్ ఆచారీలకు కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. రేవంత్ సర్కార్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి పార్టీలోకి భారీగా చేరుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, డివిజన్ నేతలు పాల్గొన్నారు.

# కారుణ్య సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ, పండ్లు పంపిణీ

## -తల్లి దండ్రులే మనకు దైవ స్వరూపాలు : డాక్టర్ దాసి నాగరాజు



కొంపల్లి, మేజర్న్యూస్‌: మనకు జన్మనిచ్చి మన జీవితాలను తీర్చిదిద్దిన తల్లిదండ్రులే మనకు దైవ స్వరూపాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ దాసి నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన తల్లిదండ్రుల వర్ధంతి సందర్భంగా నిజాంపేట్‌లోని కార్యాలయంలో తల్లిదండ్రుల చిత్రపటానికి దాసి నాగరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మనిచ్చిన భూమి, జన్మనిచ్చిన తల్లి స్వర్గం కంటే మిన్న అని, భవిష్యత్‌లో మనం ఎంత గొప్ప స్థాయిలో ఉన్న దానికి కారణం మన తల్లిదండ్రులే అని గుర్తుంచుకోవాలన్నారు. తన తండ్రి పేరు రత్తయ్య అని, గ్రామంలో 3 సార్లు వార్డు మెంబెర్‌గా, ఒకసారి గ్రామ ఉపసర్పంచ్‌గా పనిచేశారని, ప్రజాసేవలో నిస్వార్థంగా పనిచేసి గ్రామంలో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. ఆ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని, దేశ ప్రజలందరూ తన వసుదైక కుటుంబంగా భావించి తన జీవితాన్ని ప్రజా సేవకే సంపూర్ణంగా అంకితం చేసిన ప్రియతమ నాయకులు, ప్రధాని నరేంద్ర మోడీ ఆశయ సాధన కోసం రాజకీయాల్లో పనిచేస్తున్నానని డాక్టర్ దాసి నాగరాజు అన్నారు. తన తల్లి పేరు రత్నమ్మ అని తన చుట్టు పక్కల వారు కుటుంబం, పిల్లల ఆహార అవసరాల కోసం ఏది అడిగినా కాదనకుండా ఇచ్చే మంచి గుణం కలిగింది తన తల్లిఅని, ఆమె నేర్పిన పరోపకార గుణమే కారుణ్య వెల్ఫేర్ సొసైటీ స్థాపించడానికి కారణమన్నారు. కొందరైనా నిరుపేదలు, అభాగ్యులకు అండగా ఉండాలన్నదే తమ ఆశయమని, వారికి ఆశ్రయం కల్పించేందుకు త్వరలో కారుణ్య వృద్ధాశ్రమాన్ని కారుణ్య వెల్ఫేర్ సొసైటీ అధ్యర్యంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నాగరాజు తెలిపారు. అనంతరం నిజాంపేట్ బస్ స్టాప్ వద్ద గల చలివేంద్రంలో సుమారు 600 మందికి పైగా ప్రజలకు ఉచితంగా మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాయల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఝాన్సీ రాణి, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గ సభ్యులు కిరణ్, కమలాకర్, కార్యాలయ సిబ్బంది, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా కెప్టెన్ వరప్రసాద్ బాబు పదవీ విరమణ వీడ్కోలు



హిమాయత్ నగర్ , మేజర్ న్యూస్ : విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కష్టపడి నా ప్రతి ఒక్కరి జీవితంలో పదవి విరమణ తప్పనిసరి అని, పదవి విరమణ అంటే వృత్తి బాధ్యతల నుండి వైద్యులకి ప్రస్తుత మార్గం వైపు పయనిస్తూ విశ్రాంతి పొందటమే కానీ వ్యక్తి నుండి కాదు అని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ అన్నారు. మంగళవారం అఫ్జల్గంజ్ లోని నయాపూల్ సమీపానగల గవర్నమెంట్ సిటీ కళాశాలలో ఎన్సిసి ఆఫీసర్ మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కెప్టెన్ వరప్రసాద్ బాబు పదవీవిరమణ వీడ్కోల సందర్భంగా కళాశాల సమావేశ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.కెప్టెన్ వరప్రసాద్ ఎన్బి సైన్స్ కళాశాలలో మరియు సిటీ కళాశాలలో గత 35 సంవత్సరాలుగా ఎన్సిసి ఆఫీసర్ మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులుగా క్రీడారంగంలో కళాశాల విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వ రంగంలో జరిగే పోటీలలో ఎన్నో పథకాలు ప్రశంసా పత్రాలు అవార్డులు వచ్చేటట్టు కృషి చేశారన్నారు. క్రమశిక్షణ, శాంతి, మతసామరస్యం,పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛభారత్ తదితర కార్యక్రమంలో కళాశాల లో విద్యార్థులకు సూచనలిస్తూ ఎన్సిసి '%జ%' సర్టిఫికెట్ మరియు పోలీస్, ఆర్మీ, నేవీ తదితర ప్రభుత్వ ఉద్యోగాలు కొన్ని వందల మందికి వచ్చాయి అంటే కారణం వరప్రసాద్ అని ఆయన కృషి వల్లే వచ్చాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్, ఢిల్లీ శివకుమార్ శాలువా, ప్రశంసా పత్రం, పూలమాల, మరియు జ్ఞాపకతో కెప్టెన్ వరప్రసాద్ కు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంబీ సైన్స్ కళాశాల పూర్వ ఎన్సిసి విద్యార్థి విద్యార్థులు 11/2 బెటాలియన్ మరియు ఫిజికల్ డైరెక్టర్ ఢిల్లీ శివకుమార్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ జె నీరజ, డాక్టర్ జేవియన్ మల్లికార్జున, తెలంగాణ ఆరెకటిక సంఘం నాయకుడు శ్రీ పి సూర్య, తెలంగాణ ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ బీసీ సంఘం నాయకుడు జి నవీన్ కుమార్, డాక్టర్ శంకర్ నాయక్, డాక్టర్ భాస్కర్ తో పాటు కళాశాల అధ్యాపకులు, ఎన్సిసి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసంగించి కెప్టెన్ వరప్రసాద్ మరియు అన్నపూర్ణ దంపతులకు కు అభినందనలు తెలిపారు.

# ఛలో "బస్ భవన్" కరపత్రం విడుదల చేసిన ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు డా:జి.సంజీవరెడ్డి

## తప్పుడు ప్రచారాన్ని ఖండించిన ఎస్ డబ్ల్యూ యు రాష్ట్ర కమిటీ



కర్మన్ ఘాట్ ,మేజర్ న్యూస్ :ఆర్టీసీ కార్మికుల సమస్యల పైన ఐ ఎన్ టి యు సి జాతీయ అద్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఐ ఎన్ టి యు సి నాయకత్వం తో ఆర్టీసీ స్టాఫ్ %డ% వర్కర్స్ యూనియన్ నాయకత్వం చర్చించి ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి మే 3 న ఛలో బస్సు భవన్ కార్యక్రమాన్ని చేపట్టాలని ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు. కొందరు కావాలనే యూనియన్ కార్యకలాపాలకు నష్టం కలిగే విధంగా విధుల నుండి రిటైర్ అయిన వ్యక్తి వ్యక్తిగత నిర్ణయం తో ఛలో బస్సు భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకటించుకుంటున్నాడని, అతనికి యూనియన్ కు ఎటువంటి సంబంధం లేదనే ప్రచారాన్ని డా: జి. సంజీవరెడ్డి సమక్షంలో ఎస్ డబ్ల్యూ యు రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. మరి కొందరు యూనియన్ వ్యతి రేకశక్తులు మే 2 న అదిలాబాద్ లో రాష్ట్ర కమిటీ మీటింగ్ ఉందని రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆదిలాబాద్ సమావేశానికి రావాలని ఫోన్ చేస్తున్నారని తెలుస్తుంది. ఈ విషయంలో కూడ సంజీవరెడ్డి సమక్షంలోనే రాష్ట్ర కమిటీ ఖండిస్తూ మే 2 న ఎస్ డబ్ల్యూ యు యూనియన్ కు సంబంధించి ఎలాంటి సమావేశం ఎక్కడ కూడ ఏర్పాటు చేయలేదని ప్రకటించారు. చలో బస్సు భవన్ కార్యక్రమానికి ముక్య అతిథిగా డా:జి.సంజీవరెడ్డి ఎస్ డబ్ల్యూ యు యునియన్ అద్యక్షులు,జాతీయ అద్యక్షులు ఐ ఎన్ టి యు సి నాయకులు , తెలంగాణ రాష్ట్ర ఐఎన్టీయుసీ నాయకులు కూడ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఛలో బస్సు భవన్ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాపితంగా అన్ని డిపోల నుండి ఆరోజు ఆఫ్ ఉన్నవారు,స్పెషల్ ఆఫ్ ఉన్నవారు, నైట్ అవుట్ ఇన్ కమింగ్ అయిన వారు, హైదరాబాద్ సిటీలో 1%ర% షిఫ్ట్ డ్యూటీ అయిపోయిన వారు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని స్టాఫ్ మరియు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

# నేడు ట్యాంక్ బండ్ పై శ్రీ శ్రీ మహాత్మా బసవేశ్వర 892 వ జయంతి ఉత్సవాలు



హిమాయత్ నగర్ , మేజర్ న్యూస్ : వీరశైవ సమాజం సికింద్రాబాద్ నిరంజనాయస్వామి పంచ్ మట్ రాణిగంజ్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ మహాత్మా బసవేశ్వర 892 వ జయంతోత్సవంను నేడు ట్యాంక్ బండ్ పైన ఉన్న బసవేశ్వర విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు వీరశైవ సమాజము అధ్యక్షులు మాడపు వీర మల్లేష్, ఉపాధ్యక్షులు బద్రి ఈశ్వరప్ప, కార్యదర్శి కోట గుండప్ప, సహాయ కార్యదర్శి వేపూరి రాజేశ్వర్, కోశాధికారి తంగడిపల్లి లింగములు తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మహాత్మా బసవేశ్వర విగ్రహానికి పూజా కార్యక్రమం అనంతరం ప్రసాద వితరణ ఉంటుందని వారు తెలిపారు. రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం హాజరు కానున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ చిన్న వీరప్ప, బీసప్ప, ప్రవీణ్ కుమార్, గౌరీ శంకర్, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

# బాక్స్ డ్రైన్‌తో వరద ముంపు సమస్య పరిష్కారం

## కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్



కాప్రా, మేజర్ న్యూస్:బాక్స్ డ్రైన్ పనులు పూర్తయితే వివిధ కాలనీలకు వరద ముంపు సమస్య పరిష్కారమవుతుందని జీహెచ్ ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని బి.యన్.రెడ్డి నగర్ కాలనీలో బాక్స్ డ్రైన్ పనులను ఆమె, అధికారులతో కలిసిపరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ బాక్స్ డ్రైన్ పనులలో నాణ్యత పాటిస్తూ త్వరగా ఈ పని పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు ఏఈ స్వరూప, వర్క్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, కాలనీ అధ్యక్ష కార్యదర్శులు వెంక ట్రాంరెడ్డి, కనకరాజు గౌడ్, రామచంద్రయ్య, వాసుదేవా రెడ్డి, రంగారెడ్డి, వీరన్న, నాగేష్, రాజశేఖర్ రెడ్డి, లక్ష్మణ్ చారి, తిరుపతయ్య, ఏఎంసీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# సీఎం సహాయ నిధి పేదల పాలిట వరం : కార్పొరేటర్ ధర్పల్లి



కర్మన్ ఘాట్, మేజర్ న్యూస్ :ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడ డివిజన్ పరిధిలో గ్రీన్ పార్క్ కాలనీకి చెందిన రజిని కడుపు ఇన్ఫెక్షన్ సమస్య తో బాధపుతూ చికిత్స చేయించుకున్నారు. కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి ని సంప్రదించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధికి అప్లై చేయించారు. బాధితులకు 42,500 చెక్కును మంజూరు మంజూరైనట్లు కార్పొరేటర్ కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. అట్టి చెక్కును మంగళవారం కార్పొరేటర్ చేతుల మీదుగా వాయిదా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పేద కుటుంబాల ఆరోగ్య భద్రతకు సీఎం సహాయ నిధి ఒక వరం లాంటిదని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కందికంటి శ్రీధర్ గౌడ్, యస్వంత్ రాజ్ పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టండి

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః నేషనల్ ఏలిజిబిలిటీ కమ్ ఏంట్రాన్స్ టెస్ట్ (నీట్) పరీక్షను హైదరాబాద్ జిల్లాలో ఎంతో పకడ్బందిగా,పారదర్శకంగా నిర్వహించాలని ,ఆ దిశగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నీట్ పరీక్ష నిర్వహణపై సెంటర్ సూపరింటెండెంట్లు,సిటీ కో-ఆర్డినేటర్స్, వివిధ బ్యాంక్‌లు,అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర మాట్లాడుతూ జిల్లాలో మే,4న జరిగే నీట్ పరీక్ష నేపథ్యంలో 62 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 26609 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు, మే,4వ



తేదిన మధ్యాహ్నం 2.00 గంటలనుంచి సాయంత్రం 5.00 గంటలవరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆ దిశగా అన్ని కేంద్రాలను ముందుగా తనిఖీచేసి, నివేదికను అందించాలన్నారు. పరీక్ష రోజున ఆర్టీసి అధికారులు ప్రత్యేకంగా పరీక్ష కేంద్రాల రూట్‌లలో బస్సులను నడపాలని,వికలాంగ అభ్యర్థులు ఇబ్బంది పడకుండా వీల్‌చైర్ తోపాటు క్రింది ఫ్లోర్‌లో పరీక్ష రాసేవిధంగా తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి,అదనపు డిసిపి నరసింహరావు,ట్రాఫిక్ అదనపు డిసిపి రామదాస తేజావత్,వివిధ శాఖల అధికారులు,సెంటర్ సూపరింటెండె ంట్లు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్ పల్లి మేజర్ న్యూస్, ప్రజల ప్రోత్సాహం మద్దతు తమకు వరంగల్ ఎల్కతుర్తి లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ అపారమైన ఉత్సాహాన్ని ఎనలేని ఉత్తేజాన్ని ఇచ్చేందని 0 కూకట్పల్లి నియోజకవర్గ శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా...వరంగల్ రజతోత్సవ సభ సూపర్ సక్సెస్ అయ్యిందని అన్నారు.. ఈ సభకు గ్రామగ్రామం నుండి ప్రజలందరూ తండోపతండాలుగా తరలి వచ్చారన్నారు.. దేశ చరిత్రలోనే వరంగల్ బిఆర్ఎస్ సభలాంటి మీటింగ్ ఏనాడు జరుగలేదు అని తెలిపారు.కెసిఆర్ సభ సక్సస్ తట్టుకోలేకనే ఆగమేఘాల మీద కాంగ్రెస్ మంత్రులు ప్రెస్ మీట్ పెట్టారు అని అన్నారు.జనాలు రాలేదు బాహుబలి సెట్టింగ్ అని కాంగ్రెస్ మంత్రులు అంటున్నారు..అని సిగ్గు, శరం ఉంటే వరంగల్ కాంగ్రెస్ కార్యకర్తలను అడగండి ఎన్ని లక్షల మంది ప్రజలు వచ్చారో... వారే చెప్తారని హితవు



పలికారు. 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేసారు. 20 హామీలు కూడా నెరవేర్చనీ కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ ను విమర్శిస్తారా...అంటూ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వనికి చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడిస్తారు. రేవంత్ సర్కార్ ఎన్ని అబద్ధాలు ఆడిన వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అని అన్నారు. రజతోత్సవ సభకు కూకట్ పల్లి నియోజకవర్గం నుండి వేలాది సంఖ్యలో తరలివచ్చి సభను విజయం చేసిన ప్రజలకు, , కార్పొరేటర్లకు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# డ్రైనేజీ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



కొండాపూర్,మేజర్ న్యూస్ : శేరిలింగంపల్లి డివిజన్ గోపి నగర్ దర్గా, చర్చి బస్తీలలో డ్రైనేజీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ జలమండలి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ, సీసీ రోడ్డు మరియు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్వయంగా సమస్యలను ఇంజనీరింగ్ సెక్షన్ ఏఈ భాస్కర్, వాటర్ వర్క్స మేనేజర్ అభిషేక్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ వెంకట్ రామ్ రెడ్డి తో కలిసి స్థానికవాసుల తో రచ్చబండ వేదికగా వారి ఫిర్యాదులను కార్పొరేటర్ రాగం స్వీకరించారు. ఆయా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ...గోపి నగర్, నెహ్రూ నగర్ లలో



అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని సూచించారు. డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికిగాను వెంటనే కొత్త పైపులైన్ ఏర్పాటు పనులు మొదలు పెట్టాలని సూచించారు. త్రాగు నీరు, మురుగు నీటి సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సీసీ రోడ్డు మంజూరు కాగా అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ పనులు పూర్తి చేసిన వెంటనే సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యాదా గౌడ్, దస్తగిరి, రవి, గఫూర్, అశోక్, రజాక్, ఖాజా, నాని, బాలస్వామి, చోటు, చంద్రమౌళి, ప్రవీణ్, ఎజాజ్, జగదీశ్, రాంచందర్, మహిళలు నిరూప, లక్ష్మి, కవిత, గౌసియా బేగం, స్వరూప రాణి, ఎల్లమ్మ, స్థానిక వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

## శంభీపూర్ క్రిష్ణ



దుండిగల్ మేజర్ న్యూస్ : అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సమస్యల పరిష్కారంతోపాటు ప్రజా అవసరాలకు అనుగుణంగా సంబంధిత అధికారులతో మాట్లాడి మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, కాలనీల సభ్యులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారి ప్రాంతాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పలువురు విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి వివేకానందల దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అదే విధంగా పలు ప్రాంతాలలో జరగనున్న వివాహ వేడుకల కార్యక్రమాలలో పాల్గొనాలని పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

# కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది

## కూన శ్రీశైలం గౌడ్



జీడిమెట్ల మేజర్ న్యూస్ : కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది అని, ప్రతి కార్యకర్త పదవుల కోసం కాకుండ పార్టీ బలోపేతానికి పని చేయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బహదూర్ పల్లి, మేకల వెంకటేష్ ఫంక్షన్ హాల్ లో టీపీసీసీ అబ్జర్వర్స్ పారిజాత నర్సింహా రెడ్డి, దుర్గం భాస్కర్, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డిల అధ్యక్షతన ఏర్పాటు చేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ విస్తృఎత స్థాయి సమావేశంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్మూకాశ్మీర్ లోని పహల్గామ్ ఉగ్రదాడిలో అమాయకపు పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన సందర్భంగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించడం జరిగింది. ఏఐసీసీ, సిడబ్ల్యూసి అగ్రనాయకుల సమావేశంలో తీసుకున్న సంఘటీత్ సాల్ లో భాగంగా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ పునరనిర్మాణం, కాంగ్రెస్ పార్టీ బలోపేత నిర్ణయాల నేపథ్యంలో ఈసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మానంలో, కమిటీల ఏర్పాటులో క్షేత్రస్థాయిలో పరిశీలించి బస్తి స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ ప్రతిష్టాత్మక నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఏఐసీసీ అగ్రనాయకులు సోనియ గాంధీ, మల్లిఖార్జున్ ఖార్గే, రాహుల్ గాంధీల ఆధ్వర్యంలో సిడబ్ల్యూసి సమావేశంలో సంఘటీత్ సాల్ లో భాగంగా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ పునరనిర్మాణం, కాంగ్రెస్ పార్టీ బలోపేత నిర్ణయాలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు ఉన్నత పదవులు ధక్కేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంధాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సరెడ్డి భూపతి రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, మహిళ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, జిల్లా మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, మున్సిపాలిటీ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు,మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపిలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కార్పొరేటర్స్, మాజీ సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉగ్ర దాడికి నిరసనగా నివాళులు అర్పించిన జిహెచ్ఎంసి కార్పొరేటర్లు





శేరిలింగంపల్లి,మేజర్ న్యూస్ : శేరిలింగంపల్లి,మేజర్ న్యూస్ : పహల్గాం లో ఏప్రిల్ 22న పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ జిహెచ్ఎంసి కార్పొరేటర్లు మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద మృతుల కుటుంబాలకు డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమీషనర్లు, సంతాపం తెలిపి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్,జగదీశ్వర్ గౌడ్ . మాట్లాడుతూ పాకిస్తాన్ దేశ ద్రోహులను తక్షణమే మట్టి కురిపించాలని హెచ్చరించారు. పహల్గాం లో పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడులను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు వునరావృతం కాకుండా ఉండేలా భారత ప్రభుత్వం ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుల మతాలకు అతీతంగా దేశ ప్రజలు ఏకమై తీవ్రవాదాన్ని అంతమొందించేందుకు దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఇలాంటి దాడులు వునరావృతం కాకుండా ఉండాలంటే భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్ల వెంకటేష్ గౌడ్ ,అధికారులు జీహెచ్ఎంసీ తదితర డివిజన్ కార్పొరేటర్లు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

## – జిహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి




హయత్ నగర్, మేజర్ న్యూస్: డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మనసురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా మన్సూరాబాద్ డివిజన్, హయత్ నగర్ ప్రాంత మోడీ బిల్డర్స్ పారడైజ్ అపార్ట్మెంట్స్ లో స్థానికంగా ఉన్న సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి చెత్త సేకరించి ఆటో రావట్లేదని, వీధి కుక్కల బెడద ఉందని, అపార్ట్మెంట్ ముందు సిసి రోడ్ నిర్మించాలని పలు విషయాలను స్థానికులు తన దృష్టికి తీసుకు వచ్చారని ఆయా సమస్యలను, అభివృద్ధి పనులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో బ్యానర్ ప్రదర్శనతో నిరసనగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్స్ అధ్యక్షులు వీరబాబు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సెక్రటరీ బిక్కి ప్రశాంత్, వెంకటరత్నం, అయ్యప్ప, శానిటేషన్ సిబ్బంది శ్రీనివాసరావు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం



దుండిగల్ మేజర్ న్యూస్ : బహదూర్ పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్ లో మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కో ఆర్డినేటర్లు పారిజాత నరసింహ రెడ్డి, దుర్గం భాస్కర్, జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని, పార్టీకి సేవ చేసిన వారికి ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మీ, నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



రహ్మత్‌నగర్, మేజర్ న్యూస్. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేద కుటుంబ సభ్యులకు మెరుగైన చికిత్స లభించడానికి ఎంతో దోహతపడుతుందని రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్.రెడ్డి పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ పథకంలో భాగంగా డివిజన్ పరిధిలోని టీ.అంజయ్య నగర్‌కు చెందిన ముబిన్ పాషాకు ప్రభుత్వం మంజూరు చేసిన 21 వెయిల విలువ గల చెక్కును సీఎన్.రెడ్డి చేతుల మీదుగా మంగళవారం లబ్ధిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# కాపరులపై దాడి.. గొర్రెలు చోరీ

## హయత్‌నగర్ కోహెడ శివారులో ఘటన





హయత్ నగర్, మేజర్ న్యూస్: గొర్రెల గుంపు వద్ద కాపలాగా ఉన్న ఇద్దరు కాపర్లపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి నగదు, గొర్రెలను గుర్తు తెలియని ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోహెడ గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంపత్ బాల్రెడ్డి పొలంలో రాచూరి శ్రీశైలం కు చెందిన సుమారు 250 గొర్రెల గుంపును రాత్ర వేళలో ఉంచారు. శ్రీశైలం కు గత కొద్దిరోజులుగా అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో ఆయన కొడుకు రాసూరు నవీన్ ( ప్రస్తుతం కుషాయిగూడ



పోలీస్ స్టేషన్ లో ట్రాఫిక్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్నాడు.) మూడు రోజులు సెలవు పెట్టి గొర్రెలను కాస్తు, కాపలా ఉంటున్నాడు. ఆదివారం రాత్ర నవీన్ తన బామ్మర్ది శ్రీకాంత్ తో కలిసి మంద దగ్గర పడుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున సుమారు 3.15 గంటల సమయంలో గుర్తు తెలియని ఎనిమిది నుండి పదిమంది వ్యక్తులు వచ్చి ఇద్దరి సెల్ఫోన్లను గుంజుకొని, నవీన్ పై కత్తులతో దాడి చేశారు. ఆ తర్వాత శ్రీకాంత్ను కొట్టి అతని వద్ద ఉన్న 5వేల రూపాయలను గుంజుకున్నారు. అనంతరం వారు తీసుకువచ్చిన బొలెరో వాహనంలో సుమారు 30 గొర్రెలను తీసుకొని పారిపోయారు. గాయాల పాలైన నవీన్ వెంటనే పేర్కొని 100కు కాల్ చేసి చెప్పారు. విజయం తెలుసుకున్న హయత్నగర్ పోలీసులు వెటర్న స్థలానికి చేరుకొని బాధితులను చికిత్స నిమిత్తం కామినేని ఆసుపత్రికి తరలించారు. నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# అనారోగ్య సమస్యలు భరించలేక వ్యక్తి ఆత్మహత్య



కొంపల్లి, మేజర్న్యూస్ః అనారోగ్య సమస్యలను భరించలేక జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రెసిడెన్షియల్ పూర్ విలేజ్ ఏనుగుల రాజశేఖర్(43) అనే వ్యక్తి ఈ నెల 27వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఇంట్లో నుండి వాకింగ్కు వెళ్తున్నా అని చెప్పి వెళ్లి తిరిగి రాలేదని, దీంతో కుటుంబ సభ్యులు జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నందు మిస్సింగ్ కంప్లైంట్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో వెన్నెలగడ్డలోని చెరువులో ఓ మృతదేహం తేలినట్లు సమాచారం రావడంతో పేట్ బషీరాబాద్ పోలీసులు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయగా, మృతుని భార్య, సోదరుడు చేరుకుని రాజశేఖర్గా గుర్తించినట్లు తెలిపారు. మృతుడికి సుమారు 8 నెలల క్రితం కంటి ఆపరేషన్ జరిగిందని, అతను డయాబెటిక్ పేషెంట్ కావడంతో కంటి ఆపరేషన్ ఫెయిల్ అయిందని, ఈ సమస్యల కారణంగా మృతుడు రాజశేఖర్ ఇంట్లో ఉండి తీవ్రంగా డిప్రెషన్కు గురై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని సోదరుడు చంద్రశేఖర్ పోలీసులకు వివరించినట్లు ఎస్సై తెలిపారు. చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్వర్రెడ్డి తెలిపారు.

# ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలి

ముషీరాబాద్ మేజర్ న్యూస్ :వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ ఆటీజం అవేరేనెస్ దినోత్సవం ఏప్రిల్ 2 సందర్బంగా లివికలాంగుల చట్టాల అమలు - అనుభవాలు మరియు మానసిక వికలాంగుల సమస్యలు - ప్రభుత్వం చేయాల్సిన కృషిలి అనే అంశం పై రాష్ట్ర సదస్సు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ అధ్యక్షతన జరిగింది.

ఈ సదస్సుకు ముఖ్య అతితులుగా హాజరైన ప్రొఫెసర్ రాజేందర్ కుమార్ ఇంచార్జి వి సుబ్రహ్మణ్యం,అలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ అధ్యక్షులు గిరిదర్ శర్మ మాట్లాడుతూ వికలాంగులు పోరాడి అనేక చట్టాలను సాధించుకున్నరని తెలిపారు. వికలాంగులను సామాజిక, ఆర్థిక, రాజకీయ రంఘాల్లో సమాన అవకాశాలు కల్పించి, సమాజంలో భాగస్వామ్యం కల్పించేందు చట్టాలు దోహదం చేస్తున్నాయని అన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం వికలాంగులకు ఆయుధం లాంటిదని తెలిపారు.విద్య, ఉద్యోగాల్లో, సంక్షేమ పథకాల్లో రిజర్వేషన్స్ అమలు చేయాలని చట్టంలో ఉన్నదని అన్నారు. వికలాంగులపై జరుగుతున్న వివక్షత, వేధింపులు, అవమానాల నుండి రక్షణ కల్పిస్తుందని అన్నారు. 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ అమలులోకి రావడం వలన మానసిక వికలాంగులకు భరోసా దొరికిందని అన్నారు. ఐక్య రాజ్యా సమితి హక్కుల ఒప్పంద పత్రం అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుదితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ ట్రస్ట్ మరియు నేషనల్ పాలసీ అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. నేషనల్ ట్రస్ట్ ఆటీజం, బుద్ధిమంధ్యత, సెరిబ్రాల్ పాల్సి, బహుళ వైకాల్యం కల్గిన వారికి రక్షణ కల్పిస్తుందని అన్నారు. చదువు కోవడం వలనే సమాజంలో గుర్తింపు, గౌరవం వస్తాయని అన్నారు.ఆటీజం రుగ్మాథ కలిగిన వారు సాధారణ ప్రజలతో కలిసిమెలిసి ఉండాలేరని అన్నారు. మెదడు ఎదుగుదలలో వస్తున్న మార్పులే ఆటీజం రుగ్మాథ పెరుగుదలకు కారణం అవుతున్నాయని అన్నారు.భాషా, సంభాషణ, మానసిక సమస్యలు ఎదురుకుంటారని అన్నారు. సంస్థ

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య మాట్లాడుతూలి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వికలాంగుల చట్టలలో మార్పులు చేయాలని, చట్టాలను సవరించెందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు.
దేశంలో ఆటీజంతో బాధపడే చిన్నారుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియన్ అకాడమీ అఫ్ పిడియాట్రిక్స్, ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనల ప్రకారం 9ఏండ్లలోపు వయస్సు ఉన్న వారిలో 1.5శాతం మంది ఆటీజంతో బాధపడుతున్నారని తెలిపారు. తెలంగాణాలో 9ఏండ్లలోపు వయస్సు ఉన్న పిల్లలు 60లక్షల మంది ఉన్నారని, వారిలో ఆటీజం ఉన్న పిల్లలు 90,000మంది వరకు ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆటీజం ను వైకాల్యంగా గుర్తించడం జరిగిందని తెలిపారు 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం విద్య, ఉపాధి అవకాశలతో పాటు పునరావాస సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఆటీజం తగ్గించేందుకు పని చేస్తున్న సంస్థలకు పరికరాల కొనుగోలు కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ఆటీజం రుగ్మాథ కలిగిన వారిని గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఆటీజం, మానసిక వైకాల్యం కలిగిన వారికి 5లక్షల భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వమే ఆటీజం, మానసిక వైకాల్యం కలిగిన వారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.2017మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ ప్రకారం మానసిక వికలాంగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో మానసిక వికలాంగుల కోసం ప్రత్యేక హెూమ్ నిర్మించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వమే మానసిక వికలాంగుల కోసం ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ స్కూల్స్, చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్స్, స్పీచ్, హియరింగ్,
ఆటీజం థెరపి కేంద్రాల నిర్వహణ కోసం నిబంధనలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎలాంటి నిబంధనలు అందుబాటులో లేవని, దీని వలన సెంటర్స్ నిర్వాహకులు అనుమతులు లేకుండానే థెరపి కేంద్రాలను నడుపుతున్నారని అన్నారు. క్వాలిఫైడ్ థెరపిస్టులు ఉండడం లేదని అన్నారు.

%చీ=ణ% రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ మాట్లాడుతూలి రోహబిలిటేషన్ కౌన్సిల్ అఫ్ ఇండియా నిబంధనలు ఉల్లంగిస్తూ యాదేచ్చగా సెంటర్స్ నడుపుతున్నారని అన్నారు. ప్రభుత్వ అనుమతి లేని థెరపి కేంద్రాలను మూసి వేయాలని డిమాండ్ చేశారు.స్పెషల్ స్కూల్స్, ఆటీజం, చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్స్, స్పీచ్, హియరింగ్ కేంద్రాలల్లో ఫీజులను నియంత్రిస్తూ ప్రభుత్వం చట్టం చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం నుండి అనుమతి లేకుండానే హైదరాబాద్ నగరంలో వందలాది సెంటర్స్ నడుస్తున్నాయని అన్నారు. ట్రేడ్ లైసెన్స్ తీసుకుని క్లినిక్స్ నడపడం జరుగుతున్న అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సంస్థ కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్, సి సాయమ్మ, జె రాజు మాట్లాడుతూలి రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బస్సులో వికలాంగులకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ 6000లకు పెంచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యశోద, ఉపేందర్, స్వామి, సహాయకార్యదర్శులు గంగాధర్, లింగన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, కవిత,భాగ్యలక్ష్మి, చంద్రమోహన్, బాలయ్య, శశికల, భుజంగారెడ్డి, మల్లేష్, ప్రభుస్వామి,శేఖర్ గౌడ్, కుర్మయ్య, పాముకుంట్ల చందు, లలిత, గౌతమ్, యాదయ్య రాష్ట్ర నాయకులు మంగమ్మ, ఉషా, రాజు,జంగయ్య, రమేష్ లతో పాటు వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు యువతదే

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకుల పాత్ర కీలకం**

**- జాతీయ నేతలు, రాష్ట్ర మంత్రులు**





హయత్ నగర్, మేజర్ న్యూస్: దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయి నేతలు, రాష్ట్ర మంత్రులు అన్నారు. మంగళవారం ఎల్బీనగర్ నియోజకవర్గంలో ని ఎస్ వి ఎల్ కన్వెన్షన్ హాల్ లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్, యువజన కాంగ్రెస్ జాతీయ ఇన్చార్జి కృష్ణ అల్లవారు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న దేశ భవిష్యత్తు యువతదే అంటూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి యువజన కాంగ్రెస్ కృషి మరువలేనిది అన్నారు. దేశంలో బిజెపి నరేంద్ర మోడీ నిరంకుశ పరిపాలనకు యువత త్వరలోనే చరమగీతం పాడి రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ గారిని ప్రధానిగా చూస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత కీలకపాత్ర వహించాలని సూచించారు. యువజన కాంగ్రెస్ కు సీనియర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ కి యువజన కాంగ్రెస్ గుండెకాయ అలాంటిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ, జిల్లా, నియోజకవర్గ మండల కమిటీ తదితర నాయకులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో 'ఇన్నొవేషన్ సెంటర్'తో ఏబీసీ ఫిట్‌నెస్ ముందడుగు

ABC FITNESS

ఖైరతాబాద్ మేజర్ న్యూస్: ప్రపంచవ్యాప్తంగా ఫిట్‌నెస్ టెక్నాలజీ రంగంలో సుపరిచితమైన సంస్థ 'ఏబీసీ ఫిట్‌నెస్' తాజాగా హైదరాబాద్ నగరంలో తన 'ఇన్నొవేషన్ సెంటర్'ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. ఇది సంస్థకు గ్లోబల్ స్థాయిలో ఒక కీలక ముందడుగుగా నిలిచనుందని వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా సంస్థ ఉత్పత్తుల రూపకల్పన, సాఫ్ట్‌వేర్ అభివృద్ధిపై దృష్టి సారించనుంది. మొదటి ఏడాదిలోనే 200 టెక్నాలజీ ఉద్యోగాలను సృష్టించనుంది. ప్రోగ్రామింగ్, వెబ్, మొబైల్ ఫ్రేమ్‌వర్క్‌లలో నైపుణ్యం కలిగిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు ఇది గొప్ప అవకాశంగా నిలవనుంది. ఈ సందర్భంగా ఏబీసీ ఫిట్‌నెస్ సీఈఓ బిల్ దేవిస్ మాట్లాడుతూ, "హైదరాబాద్ వృద్ధి చెందుతున్న టెక్నాలజీ కేంద్రంగా మారింది. ఇక్కడి ప్రతిభావంతుల సామర్థ్యం, జీవం నిండిన పరిసరాలు మా ఇన్నొవేషన్‌కు బలంగా నిలుస్తాయి. తద్వారా మేం ఏఐ ఆధారిత ఫీచర్లను మరింత వేగంగా అభివృద్ధి చేయగలుగుతాం. గ్లోబల్ మార్కెట్లో మాకు ఉన్న స్థానం మరింత బలపడుతుంది" అని తెలిపారు. దేశీయంగా టెక్నాలజీ రంగానికి కేంద్రబిందువైన హైదరాబాద్‌లో ఇలాంటి పెట్టుబడులు వెల్లువెత్తడం గమనార్హం. టెక్ రంగ అభివృద్ధికి, ఉద్యోగ అవకాశాల పెరుగుదలకు ఇది చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది.

## ఫాస్టర్ కిడ్స్ ప్లేస్కూల్‌ను ప్రారంభించిన బీజేపీ మేడ్చల్ ఇంచార్జి ఏనుగు సుదర్శన్‌రెడ్డి




జవహర్ నగర్, మేజర్‌న్యూస్: జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మోహన్‌రావు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫాస్టర్ కిడ్స్ ప్లేస్కూల్‌ను భారతీయ జనతా పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జి ఏనుగు సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాల్యం నుంచే పిల్లలకు ఉన్నత విద్యను అందించేందుకు ప్లేస్కూల్స్ ఎంతో దోహదపడతాయన్నారు. పిల్లలకు ప్లే స్కూల్ ద్వారానే విద్యపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. మెరుగైన విద్యను అందించి పిల్లలను ఉన్నత శిఖరాలకు చేరేల కృషి చేయాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బాజాపా నాయకులు కావలి మహేందర్‌యాదవ్, కమల్, ఉడుత సంతోష్‌గుప్త, రాంనాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్‌కుమార్, నన్ని, ఈల్లెకుమార్, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఇటుక బట్టీ కార్మికుడు మృతి



కొంపల్లి, మేజర్‌న్యూస్: ఇటుకల బట్టీలో పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్కు గురై మృతిచెందిన ఘటన సోమవారం సాయంత్రం పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలోని గుండ్లపోచంపల్లి శివారు నూజివీడు సీడ్స్ వెనుక గల ఇటుక బట్టీ కేంద్రంలో జరిగింది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కాపూర్ చాన్ కట్ట(32), తండ్రిపేరు మీచౌక్ కట్ట అనే వ్యక్తి సుమారు నాలుగు నెలల క్రితం ఇటుకల తయారీ కేంద్రంలో పనికోసం ఒరిస్సా రాష్ట్రం నుండి తన కుటుంబ సభ్యులతో కలిసి భార్య, ఇద్దరు పిల్లలతో పాటు గుండ్లపోచంపల్లిలో నివాసముంటున్నారని, రోజు మాదిరిగానే సోమవారం సాయంత్రం 6:30 గంటల సమయంలో ఇటుకలు తయారీ కోసం మట్టిని నీటితో తడపడానికి మోటర్ను ఆన్ చేసి తిరిగి ఆఫ్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి కాపూర్ చాన్కట్ట మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. ఇటుక బట్టి యజమాని సాంబశివరావు నిర్లక్ష్యం కారణంగా స్టార్టర్ మోటర్ని తడి ప్రదేశంలో పెట్టడం వలన ఈ విద్యుత్ ఘాతం జరిగిందని, కావున ఇటుక బట్టీ ఓనర్పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.




కాశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి మంగళవారం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నిరసనగా ర్యాలీ నిర్వహించి మౌనం పాటించిన అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహాగౌసుద్దీన్ **- అల్లాపూర్, మేజర్‌న్యూస్**